సాక్షి
మెదక్
గురువారం । 22 । ఆగస్టు । 2024



సర్కారు కొలువే లక్ష్యంగా..

ప్రభుత్వం ఇటీవల జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంతో సర్కారు కొలువే లక్ష్యంగా నిరుద్యోగులు పోటీ పడుతూ చదువుతున్నారు.

వివరాలు 8లో ►



మరణంలోనూ వీడని స్నేహం

మరణంలోనూ స్నేహబంధం వీడలేదు. శుభకార్యానికి వెళ్లిన ఇద్దరు స్నేహితులు చెరువులో మునిగి మృతి చెందారు.

వివరాలు 8లో ►



నిలిచిన చెత్త సేకరణ

శివ్వంపేట మండల కేంద్రంలో పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది.

వివరాలు 9లో ►

న్యూస్‌రీల్

ప్రజాపాలనపై దృష్టి పెట్టాలి: జెడ్పీ సీఈఓ



రికార్డులు పరిశీలిస్తున్న సీఈఓ ఎల్లయ్య

అల్లాదుర్గం(మెదక్): ప్రజాపాలనపై అధికారులు దృష్టి సారించాలని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య అన్నారు. బుధవారం అల్లాదుర్గం ఎంపీపీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా అధికారులు చూడాలన్నారు. సమయపాలన పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు టీకాలు తప్పనిసరి: డీఐఓ



టీకాలను పరిశీలిస్తున్న డీఐఓ మాధురి

కౌడిపల్లి(నర్సాపూర్): పిల్లలందరికీ తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వాలని డీఐఓ మాధురి తెలిపారు. బుధవారం మండలంలోని తునికి అంగన్‌వాడీ కేంద్రంలో వైద్య సిబ్బంది పిల్లలకు ఇస్తున్న వ్యాధినిరోధక టీకాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి నెల అర్హులైన పిల్లలందరికీ వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వాలని చెప్పారు. పోలియో, పెంటా వ్యాక్సిన్, ఐపీవీ, బీసీజీ, డీపీటీ, ఎంఆర్ తదితర టీకాలు పిల్లల వయసు ఆధారంగా ఇవ్వాలన్నారు. టీకాలు ఇచ్చే ముందు పిల్లల ఆరోగ్య సమస్యలు తెలుసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి ప్రవీన్‌కుమార్, ఏఎన్‌ఎంలు రేణుక, లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మెరుగైన విద్య అందించాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న డీటీడీఓ మాధురి

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని డీటీడీఓ నీలిమ ఉపాధ్యాయులను ఆదేశించారు. బుధవారం కౌడిపల్లి ఎస్టీ ఆశ్రమ పాఠశాల, ఎస్టీ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, ఇతర రికార్డులతో పాటు భోజనశాలను పరిశీలించారు. విద్యా సామర్థ్యాలపై విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు సమస్యలు లేకుండా చూడాలని, ఆరోగ్య సమస్యలుంటే వెంటనే వైద్య చికిత్స చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూఓ జయరాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

నర్సాపూర్: విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు సంతోష్ డిమాండ్ చేశారు. బుధవారం చౌరస్తా నుంచి విద్యార్థులతో కలిసి ర్యాలీగా వెళ్లి ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల కాకపోవడంతో పలు ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. అలాగే నియోజకవర్గంలోని పలు గ్రామాలకు బస్సులు లేక గ్రామీణ ప్రాంత వి ద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జగన్, రమేష్, వర్ధన్, ప్రవీన్, కిరణ్, ఆకాష్, రమేష్, ప్రసాద్, క్రాంతి, హేమంత్ పాల్గొన్నారు.

చేప చెరువుకొచ్చేనా!


- టెండర్లు పిలిచినా ముందుకురాని కాంట్రాక్టర్లు
- నిండుతున్న నీటి వనరులు
- ఆందోళనలో మత్స్యకారులు

ఉచిత చేపపిల్లల పథకంపై నీలినీడలు అలుముకున్నాయి. జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో చెరువులు, కుంటల్లోకి నీరు చేరుతోంది. అయితే ఇప్పటికీ మూడుసార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో స్పష్టత కరువైంది.

– మెదక్‌జోన్

జిల్లాలోని చెరువుల వివరాలు	
25 శాతం నిడిన చెరువులు	1,757
50 శాతం నిండినవి	487
75 శాతం నిండినవి	323
100 శాతం నిండినవి	80
అలుగులు పారుతున్నవి	47
మొత్తం	2,694





నిండుకుండలా జంగరాయి ఊరచెరువు

జిల్లావ్యాప్తంగా 2,694 చెరువులు ఉన్నాయి. మత్స్యకారుల అభివృద్ధి కోసం ఏటా సుమారు 2 వేల పైచిలుకు చెరువుల్లో చేప పిల్లలను పెంచుతున్నారు. ఏటా జూలైలో టెండర్లు పిలిచి ఆగస్టులో చెరువుల్లోకి నీరు రాగానే చేప పిల్లలతో పాటు నీటి వనరులు అధికంగా ఉన్న చోట రొయ్య పిల్లలను సైతం వదిలేవారు. కానీ ఈసారి ఆగస్టు మూడో వారం గడిచిపోతున్నా నేటికీ కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో ఈ ఏడాది చేప పిల్లల పెంపకం జిల్లాలో ఉందా..? లేదా? అనే అనుమానం వ్యక్తమవుతోంది. ఇప్పటివరకు 937 చెరువుల్లోకి సగానికి పైగా నీరు చేరినట్లు అధికారులు చెబుతున్నారు. సకాలంలో చేప పిల్లలను వదిలితేనే అవి పెరుగుతాయని, ఆలస్యంగా వదిలితే వేసవిలో చెరువులు ఎండిపోయే సమయానికి అవి పెరగకపోతే ఫలితం ఉండదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెండింగ్ బిల్లులు రూ.4 కోట్లు

గతంలో చేప పిల్లలను సరఫరా చేసిన కాంట్రాక్టర్లకు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం రూ.90 కోట్ల బిల్లులు ఇవ్వాల్సి ఉందని తెలిసింది. జిల్లాకు సంబంధించి రూ.4 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని సంబంధిత అధికారి తెలిపారు. ఈ ఏడాది జూలై 23, ఆగస్టు 2, 13 తేదీల్లో టెండర్ పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. దీంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం చొరవ చూపి గతంలో బకాయిపడిన బిల్లులు విడుదల చేసి కాంట్రాక్టర్లు ముందుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

16,820 మంది మత్స్యకారులు

జిల్లా వ్యాప్తంగా 306 మత్స్యకారుల సంఘాలు ఉండగా వాటిలో 16,820 మంది కార్మికులు ఉన్నారు. వీరంతా కేవలం చేపల పెంపకం, వాటిని పట్టుకుని విక్రయించి జీవనం సాగిస్తారు. కాగా ప్రతిఏటా అగస్టు 15 లోపు చెరువుల్లో చేపలను వదిలి ఏప్రిల్, మే నెలల్లో వాటిని పట్టుకుని అమ్ముకుంటారు. దీంతో వారికి ఉపాధి లభిస్తోంది. చేపలను నీటి వనరుల్లో వదిలాక కనీసం 8 నెలల పాటు ఆచెరువులో నీరు సమృద్ధిగా ఉంటేనే చేపలు పెరుగుతాయి లేకుంటే అవ్వి పెరిగే అవకాశం ఉండదని మత్స్యకారులు ఆవేదన చెందుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం

ఉచిత చేప పిల్లల పంపిణీ కోసం జిల్లాలో ఇప్పటివరకు మూడు సార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం.

– మల్లేశం, ఏడీ ఫిషరీష్ మెదక్

పాత వాహనాలు వేలం

- రూ. 6.95 లక్షల ఆదాయం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ



వేలం పాటలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: జిల్లాలోని ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో పాత వాహనాల వేలంతో రూ.6.95 లక్షల ఆదాయం వచ్చినట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో గుర్తించిన 103 వాహనాలకు వేలం పాట నిర్వహించగా 66 మంది పాల్గొన్నట్లు చెప్పారు. మొత్తం 103 వాహనాలను 4 భాగాలుగా విభజించి వేలం వేసినట్లు వివరించారు. వచ్చిన ఆదాయాన్ని ప్రభుత్వ ఖాతాలో జమచేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్‌తో పాటు జిల్లా పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

తరగతి గదిలో నేర్చుకున్న అంశాలే కీలకం

కలెక్టర్ రాహుల్‌రాజ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: గ్రౌండ్ బెస్ట్ లర్నింగ్‌ను విజయవంతం చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాలో ఎంపికైన విషయ నిపుణులకు కార్యక్రమంపై దిశా నిర్దేశం చేశారు. జిల్లావ్యాప్తంగా గణితం, భౌతికశాస్త్రం, రసాయన శాస్త్రం, జీవశాస్త్రంలో 20 మంది ఉపాధ్యా యులను ఎంపిక చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న అంశాలను అర్థవంతంగా నిజజీవితంలో ఉపయోగించుకునే విధంగా తయారు చేయాలన్నారు. ఆ దిశగా కంటెంట్ రూపొందించాలని సూచించారు. 6 నుంచి పదో తరగతి వరకు తరగతులు, సబ్జెక్టుల వారీగా తయారు చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలో అ మలు చేయాలని డీఈఓ రాధాకిషన్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుదర్శనమూర్తి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, వివిధ పాఠశాల నుంచి వచ్చిన విషయ నిపుణులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

డీఎంహెచ్‌ఓ శ్రీరామ్



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ శ్రీరామ్

పాపన్నపేట(మెదక్): విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ శ్రీరామ్ హెచ్చరించారు. బుధవారం పాపన్నపేట పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. విధుల్లో ఇద్దరు డాక్టర్లు లేకపోవడంతో ఒకరోజు వేతనాలు నిలిపివేస్తూ మెమో జారీ చేశారు. సంతరోజు పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు వస్తుంటారని, ఈరోజు కూడా విధులకు రాకపోతే ఎలాగని ప్రశ్నించారు. పరిస్థితి ఇలాగే ఉంటే నిరుపేదలకు వైద్య సేవలు ఎలా అందుతాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. డెంగీ, మలేరియా వ్యాధులు ప్రబలుతున్న ఈతరుణంలో ఇద్దరు డాక్టర్లు విధుల్లో లేకపోతే ఎలాగని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యులతో పాటు ఇతర సిబ్బంది సమయ పాలన పాటించాలని, మరోసారి పునరావృతమైతే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అంతకుముందు రికార్డులతో పాటు మందులను పరిశీలించారు.

డెంగీతో యువకుడు మృతి



శాంతికుమార్

చిన్నశంకరంపేట(మెదక్): డెంగీతో యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని శాలిపేట గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నందాల సిద్దిరాములు కుమారుడు శాంతి కుమార్ (25) జ్వరంతో బాధపడుతూ వారం రోజుల క్రితం మెదక్‌లోని ఓ ప్రైవేట్ అస్పత్రిలో చేరారు. అయితే డెంగీ లక్షణాలు ఉన్నట్లు వైద్యులు చెప్పడంతో కుటుంబ సభ్యులు మూడు రోజుల క్రితం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. యువకుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పరిష్కారం దిశగా ‘ధరణి’

మెదక్ కలెక్టరేట్: ఏళ్ల తరబడి జిల్లాలోని రైతులు ఎదుర్కొంటున్న ధరణి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో చర్యలు చేపట్టింది. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా ధరణిలో 34 వేలకుపైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. కలెక్టర్‌లో గల ప్రజావాణి హాల్‌లో జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లతో ధరణి సమస్యల పరిష్కారానికి ఏర్పాట్లు చేసింది. ప్రతి మండలానికి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి అధికారులతో పరిష్కార చర్యలు చేపడుతున్నారు. సమస్యలను తహసీల్దార్లు పరిశీలిస్తూ అధికారులకు సహకరిస్తున్నారు.

మూడేళ్ల చిన్నారిపై అత్యాచారం

సిద్దిపేటఅర్బన్: మూడేళ్ల చిన్నారిపై అత్యాచారం జరిగింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. రాఖీ పౌర్ణమి రోజున ఈ అఘాయిత్యం చోటుచేసుకుంది. సిద్దిపేట త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నేపాల్‌కు చెందిన ఓ వ్యక్తి సిద్దిపేటలోని మైత్రి వనంలో గోగ్రీన్ అపార్ట్‌మెంట్ వద్ద సెక్యూరిటీ గార్డుగా మూడేళ్లుగా పనిచేస్తున్నాడు. అతనితో పాటు భార్య, కుమారుడి కూతురు (3) ఉంటున్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అజయ్ (30) అదే అపార్ట్‌మెంట్‌లో పెయింటింగ్ పనిచేస్తూ అక్కడే ఉంటున్నాడు. అప్పుడప్పుడు చిన్నారిని ఆడిస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో ఈ నెల 19న మధ్యాహ్నం ఎప్పటిలాగే చిన్నారిని ఆడిస్తానంటూ తన రూంకు తీసుకువెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక తాత పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనాస్థలానికి చేరుకొని చిన్నారిని ఆస్పత్రికి తరలించారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

డెమో రైలును పునరుద్ధరించండి



ఎంపీ రఘునందన్‌రావుకు వినతిపత్రం అందిస్తున్న తపస్ నాయకులు

చేగుంట(తూప్రాన్): రద్దు చేసిన డెమో రైలును పునరుద్ధరించాలని తపస్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాతు సురేష్ ఆధ్వర్యంలో ఎంపీ రఘునందన్‌రావుకు బుధవారం హైదరాబాద్‌లో వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కాచిగూడ స్టేషన్ నుంచి ఉదయం 8 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12 గంటలకు నిజామాబాద్‌కు చేరుకొని, అక్కడి నుంచి 2:30 గంటలకు కాచిగూడకు బయలుదేరే డెమో రైలును రద్దు చేశారని చెప్పారు. దీంతో వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. స్పందించిన ఎంపీ రఘునందన్‌రావు రైల్వే అధికారులతో మాట్లాడి రైలును పునరుద్ధరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ, ఉపాధ్యక్షుడు వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

రుణమాఫీపై పోరుబాట

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మ



మెదక్ మున్సిపాలిటీ: ఎలాంటి ఆంక్షలు లేకుండా అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు నేడు మెదక్‌లో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, నాయకులు తిరుపతి రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ జగపతి, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్ హాజరుకానున్నట్లు చెప్పారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి ధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



వ్యవసాయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న బీకేఎస్ నాయకులు

మెదక్ కలెక్టరేట్: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలని భారత్ కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పన్యాల వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీకేఎస్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లో నిరసన తెలిపి జిల్లా వ్యవసాయ శాఖ టెక్నికల్ అసిస్టెంట్ డైరెక్టర్ వినయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అప్పులు బాధతో కొట్టుమిట్టాడుతున్న రైతులందరికీ మాఫీ వర్తింపజేయాలని కోరారు. అలాగే రైతులు పండించిన అన్ని రకాల పంటలకు మద్దతు ధర కల్పించాలన్నారు. వ్యవసాయ పరికరాలు, ఎరువులు సబ్సిడీపై అందజేయాలన్నారు. అంతకుముందు మెదక్ ఆర్టీసీ డిపో నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జోనల్ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, జిల్లా కార్యదర్శి అనిల్‌కుమార్, రాజేశ్వర్‌రెడ్డి, నర్సయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కెమికల్ పరిశ్రమ వద్దు

గ్రామస్తుల ఏకగ్రీవ తీర్మానం



గ్రామసభలో పరిశ్రమ ప్రతినిధులు, గ్రామస్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని ఉసిరికపల్లిలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న కెమికల్ పరిశ్రమ వద్దంటూ గ్రామస్తులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. బుధవారం గ్రామస్తులతో ఫెర్మాక్ బయో ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ ప్రతినిధులు గ్రామసభ నిర్వహించారు. నిర్మిస్తున్న పరిశ్రమ ద్వారా ఎలాంటి కెమికల్ వ్యర్థాలు బయటకు రావని, పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తూ పరిశ్రమ నిర్వహణ ఉంటుందని వివరించారు. ఇందుకు గ్రామస్తులు ఒప్పుకోలేదు. కెమికల్ పరిశ్రమ ఏర్పాటు చేస్తే చెరువు, కుంటల నీటితో పాటు బోరుబావుల్లోని నీరు సైతం కలుషితం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కెమికల్ పరిశ్రమ ఏర్పాటు చేయొద్దని తీర్మాన కాపీని పంచాయతీ కార్యదర్శి సుష్మకు అందజేశారు.

ఏడుపాయల ఈఓ బాధ్యతల స్వీకరణ



పాపన్నపేట(మెదక్): ఏడుపాయల దేవస్థానం ఈఓగా చంద్రశేఖర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఉమ్మడి మెదక్ జిల్లా సహాయ కమిషనర్‌గా ఉన్న చంద్రశేఖర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈసందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకొని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భక్తులకు అందుబాటులో ఉండి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

డ్రోన్‌తో డబ్బు, సమయం ఆదా

ఐసీఏఆర్–ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ తారా సత్యవతి

టేక్మాల్(మెదక్): పంటలపై మందుల పిచికారీకి డ్రోన్‌ను ఉపయోగిస్తే డబ్బు, సమయం ఆదా అవుతాయని ఐసీఏఆర్–ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ సీ.తారా సత్యవతి తెలిపారు. బుధవారం టేక్మాల్ మండలంలోని కుసంగి రైతు వేదికలో రైతు సంఘం ఆధ్వర్యంలో ఐసీఏఆర్–ఐఐఎంఆర్ హైదరాబాద్ వారి సౌజన్యంతో డ్రోన్‌ల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం, కూలీల ఖర్చులు, సమయాన్ని తగ్గించడంలో డ్రోన్ వినియోగం ప్రాముఖ్యతను వివరించారు. 750 మంది రైతులను సమీకరించి, రైతులకు నాణ్యమైన సేవలను అందించడంలో ఎఫ్‌పీఓ చేస్తున్న కృషిని ఆమె ప్రశంసించారు. గ్రామాల్లోని రైతులు వాణిజ్య పంటలతోపాటు చిరు ధాన్యాల సాగు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో డ్రోన్‌లతో 150 ఎకరాల్లో మందును పిచికారీ చేసి రైతులకు పలు సూచనలు చేశారు. ఇందు ఐఐఎంఆర్‌కు చెందిన శాస్త్రవేత్తలు డా.గంగయ్య, డా.శ్రీనివాస్ బాబు, డా.సంగప్ప, డా.రాజేష, డా.స్వర్ణ, డా.రఫీ, స్థానిక వ్యవసాయాధికారి రాం ప్రసాద్, మాజీ జిల్లా కోఆప్షన్ సభ్యుడు యూసూఫ్, గ్రామ పెద్దలు మొగులిరెడ్డి, సంగమేశ్వర్‌గౌడ్, మల్లయ్య, ఎఫ్‌పీఓ చైర్మన్ మొగలయ్య, సీఈవో వెంకటేశం, సంఘం డైరెక్టర్లు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు గంగారం విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని గంగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పండరినాయక్ తెలిపారు. జిల్లా స్థాయి యోగా పోటీలు 17వ తేదీన జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో జరిగాయి. ఈ పోటీల్లో జిల్లా నుంచి రాష్ట్ర స్థాయికి 42 మంది విద్యార్థులు ఎంపిక కాగా వీరిలో తొమ్మిది మంది గంగారం పాఠశాలకు చెందిన వారే కావడం విశేషం. విద్యార్థులను బుధవారం ఉపాధ్యాయ బృందం ఘనంగా సత్కరించింది. రాష్ట్ర స్థాయిలోనూ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ప్రధానోపాధ్యాయులు ఆకాంక్షించారు. ఇదిలా ఉండగా రాష్ట్ర స్థాయి పోటీలు అక్టోబర్ 3,4,5 తేదీల్లో జరగనున్నాయి.

యువతి కిడ్నాప్
– రక్షించిన పోలీసులు



యువకుడితో పోలీసులు

మద్దూరు(హుస్నాబాద్): హైదరాబాద్ కూకట్‌పల్లిలో కిడ్నాప్ అయిన యువతిని ధూళ్మిట్ట మండలంలోని లింగాపూర్ గ్రామ పరిధిలోని జెల్లగూడంలో మద్దూరు పోలీసులు కాపాడారు. సీఐ శ్రీను కథనం మేరకు.. హన్మకొండ జిల్లాకు చెందిన నాలీబాల శిరీష(23)ని ములుగు జిల్లాకు చెందిన తీగల రాజశేఖర్‌రెడ్డి(30) మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేసి జెల్లగూడంకు మంగళవారం తీసుకొచ్చాడు. రాజశేఖర్ రెడ్డి ప్రవర్తనలో మార్పు గమనించిన యువతి బుధవారం ఉదయం 7 గంటలకు డయల్ 100కి కాల్ చేసి తాను కిడ్నాప్‌కు గురయ్యానని తెలిపింది. స్పందించిన ఎస్ఐ షేక్ మహబూబ్, ఏఎస్ఐ జగదీశ్వర్ హుటాహుటినా గ్రామానికి వెళ్లి ఇరువురిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. విచారణలో యువతిపై కూకట్‌పల్లిలో పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైనట్లు తెలుసుకున్నారు. కాగా యువతీ, యువకుడు కూకట్‌పల్లిలోని ఆస్పిరో ఫార్మాసిటికల్స్ కంపెనీలో పని చేస్తున్నారు. అమ్మాయిని కాపాడిన ఎస్ఐ, ఏఎస్ఐలను సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ అభినందించారు.

ఎంపీడీఓ కార్యాలయంలో పాము కలకలం



పామును చంపిన సిబ్బంది

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రమైన చిలప్‌చెడ్ ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం పాము కలకలం సృష్టించింది. వివరాల్లోకి వెళ్తే.. ముదిరాజ్ సంఘం భవనంలో కొనసాగుతున్న ఎంపీడీఓ కార్యాలయంలో సిబ్బంది పనిలో నిమగ్నమై ఉండగా ఓ పాము అకస్మాత్తుగా లోపలికి వచ్చింది. అది చూసిన సిబ్బంది బయటకు పరుగెత్తుకొచ్చారు. అనంతరం గ్రామ కార్మికులతో కలిసి పలువురు సిబ్బంది పామును చంపేశారు.

క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని..
– పటాన్‌చెరులో సైబర్ మోసం

పటాన్‌చెరు టౌన్: క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని సైబర్ మోసానికి పాల్పడిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు శివారులోని కృషి డిఫెన్స్ కాలనీకి చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగినికి 16వ తేదీన అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని నమ్మించారు. దీంతో ఆ ఉద్యోగిని తన వివరాలను అపరిచిత వ్యక్తులకు చెప్పడంతో పాటు తనకి వచ్చిన ఓటీపీని చెప్పింది. వెంటనే ఉద్యోగిని ఖాతాలోని రూ.52 వేలు నగదు డ్రా అయినట్టు మెసేజ్ వచ్చింది. బాధితురాలు వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. రూ.6,300 హోల్డ్ అయినట్టు పోలీసులు తెలిపారు.

సర్కారు కొలువే లక్ష్యంగా..

గ్రంథాలయంతో దోస్తీ.. పుస్తకాలతో కుస్తీ

సర్కారు కొలువు ఎందరో యువత జీవిత లక్ష్యం. ఆ ఆశయాన్ని సాధించాలనే లక్ష్యంతో కాలంతో పోటీ పడుతూ చదువులు సాగిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంతో నిరుద్యోగుల్లో ఆశలు రేకెత్తాయి. ప్రిపరేషన్ కోసం అందుబాటులో ఉన్న గ్రంథాలయాలకు పరుగులు పెడుతున్నారు. అక్కడ గంటల తరబడి పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ప్రతి రోజూ 1,300 మందికి పైగా నిరుద్యోగులు చదువుకోవడానికి జిల్లా గ్రంథాలయాలకు వెళ్తున్నారు.
– మెదక్‌జోన్



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చదువుకుంటున్న అభ్యర్థులు

- మెదక్ పట్టణంలో రేయింబవళ్లు చదువు
- పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత
- నెలకు 40 వేల మందికి పైగానే..
- సిబ్బంది కొరతతో అభ్యర్థుల ఇబ్బందులు

జిల్లాలో మొత్తం 18 గ్రంథాలయాలు ఉన్నాయి. వాటిలో 15 శాఖ గ్రంథాలయాలు, 2 గ్రామీణ గ్రంథాలయాలు, ఒకటి జిల్లా గ్రంథాలయం ఉంది. వీటిలో 14 గ్రంథాలయాలకు సొంత భవనాలు ఉండగా, మిగితావి అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంతో పాటు అంతకుముందు జారీ చేసిన ఉద్యోగ నోటిఫికేషన్లతో నిరుద్యోగులు పుస్తకాలను వదలడం లేదు. ఇందులో కాస్త ఆర్థికంగా ఉన్న వారు హైదరాబాద్ లాంటి నగరాలకు వెళ్లి కోచింగ్ తీసుకుంటుండగా.. పేద కుటుంబాలకు చెందిన నిరుద్యోగ యువత మాత్రం దగ్గరిలో ఉన్న గ్రంథాలయాలకు వెళ్లి ఉదయం నుంచి సాయంత్రం వరకు చదువుకుంటున్నారు. అలాగే ఇటీవల టెట్, గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన వారు సైతం ప్రిపేర్ అవుతున్నారు.

నిత్యం 1,300 మందికి పైగా..

జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రంథాలయాల్లో నిత్యం 1,300 మందికిపైగా నిరుద్యోగులు చదువుకుంటున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. జూలైలో 40,450 మంది నిరుద్యోగులు చదువుకున్నట్లు గ్రంథాలయ సిబ్బంది చెబుతున్నారు. అలాగే గ్రంథాలయాలన్నింటిలో 1.60 లక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. రెండేళ్లలో రూ.1.15 లక్షలు వెచ్చించి పుస్తకాలు కొనుగోలు చేసినట్లు సిబ్బంది పేర్కొన్నారు. ప్రతీ నెల రూ.25 వేలు వెచ్చించి బుక్స్ కొనుగోలు చేసేందుకు అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు.



వేధిస్తున్న సిబ్బంది కొరత

గ్రంథాలయాల్లో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఈ విషయంపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో రీడర్స్ ఇబ్బంది పడుతున్నారు. 18 గ్రంథాలయాల్లో మొత్తం 23 సాంక్షన్ పోస్టులు ఉండగా, కేవలం ఏడుగురు మాత్రమే విధుల్లో ఉన్నారు. 16 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో 12 మంది లైబ్రేరియన్లు ఉండాల్సి ఉండగా.. నలుగురు మాత్రమే ఉన్నారు. నలుగురు రికార్డు అసిస్టెంట్లకు ఇద్దరు మాత్రమే ఉన్నారు. ఇద్దరు వాచ్‌మెన్‌లకు ఒక్కరే ఉన్నారు. ఐదు అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఫలితంగా ఒక్కో సిబ్బందికి మూడు నాలుగు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో వాటి నిర్వహణ అధ్వానంగా తయారైంది. ప్రస్తుతం నిరుద్యోగులు పెద్ద ఎత్తున లైబ్రరీలకు తరలి రావడంతో సిబ్బంది కొరత కారణంగా ఇబ్బందులు తప్పడం లేదు.

గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్నా..



ప్రభుత్వం ఉద్యోగ క్యాలెండర్ విడుదల చేయగానే నిత్యం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయానికి వస్తున్నాను. గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్నాను. ఇంటి నుంచే బుక్స్ తెచ్చుకొని ఇక్కడ చదువుకుంటున్నాను. ఇక్కడ కూడా కాంపిటేషన్ బుక్స్ అందుబాటులో ఉన్నాయి. అవసరమైన బుక్స్ అడిగితే ఇస్తున్నారు.
– సాయి, రామాయంపేట

ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యం..



నేను డిగ్రీ పూర్తి చేశా. ప్రభుత్వ ఉద్యోగం కోసం నెల రోజులుగా ప్రిపేర్ అవుతున్నా. నిత్యం గ్రంథాలయానికి వచ్చి చదువుకుంటున్నాను. ఇక్కడ ఉన్న బుక్స్‌ను బయటకు ఇవ్వడం లేదు. ఇక్కడే చదువుకొని వెళ్లాల్సి వస్తోంది.
– మహేశ్, మెదక్

బుక్స్ తెప్పిస్తున్నాం

గ్రంథాలయాలకు వచ్చి చదువుకునే వారి కోసం కోరిన బుక్స్ తెప్పిస్తున్నాం. పుస్తకాల కొనుగోలు కోసం ప్రతీ నెలా రూ.25 వేలు వెచ్చిస్తున్నాం. రెండేళ్లలో రూ. 1.15 లక్షల వ్యయంతో పుస్తకాలు కొనుగోలు చేశాం. నిరుద్యోగులకు అన్ని పుస్తకాలు అందుబాటులో ఉండేలా చూస్తాం.
– వంశీకృష్ణ, గ్రంథాలయ ఇన్‌చార్జి సెక్రటరీ

మరణంలోనూ వీడని స్నేహం

- చెరువులో మునిగి ఇద్దరు మృతి
- మేనమామ గృహ ప్రవేశానికి వచ్చి మృత్యుఒడిలోకి..
- కొండపాక మండలం సిర్సనగండ్లలో విషాదం



ఊర చెరువు వద్ద రోదిస్తున్న కుటుంబీకులు, గుమిగూడిన గ్రామస్తులు



హేమంత్, నిఖేష్ మృతదేహాలు

కొండపాక(గజ్వేల్): మరణంలోనూ స్నేహబంధం వీడలేదు. శుభకార్యానికి వచ్చిన ఇద్దరు స్నేహితులు చెరువులో మునిగి మృతి చెందారు. ఈ ఘటన కొండపాక మండలం సిర్సనగండ్లలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన సముద్రాల ఆంజనేయులు ఈనెల 23న గృహ ప్రవేశ కార్యక్రమం ఉంది. ఈ మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులో నివాసం ఉంటున్న ఆంజనేయులు బామ్మరిది మల్లేశం తన కుటుంబ సభ్యులు సిర్సనగండ్లకు వచ్చారు. మల్లేశం కుమారుడు హేమంత్ స్నేహితుడై నిఖేష్‌వర్ధన్ వీరి ఇంటి పక్కనే ఉంటున్నాడు. గృహ ప్రవేశానికి అతడు కూడా వెంట వచ్చాడు. కాగా, ఆంజనేయులు చిన్న కుమారుడు అరుణ్, బి.హేమంత్(16) అతడి స్నేహితుడు నిఖేష్ వర్ధన్, (13) కలిసి గ్రామంలోని ఊర చెరువులో మధ్యాహ్నం ఈత కోసం వెళ్లారు. ముగ్గురు కలిసి ఈత కొడుతుండగా.. హేమంత్, నిఖేష్ నీటిలో మునిగిపోతుండగా.. గమనించిన అరుణ్ కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. కేకలు వేయడంతో చెరువుకు సమీపంలో వ్యవసాయ కూలీలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే ఇద్దరు పిల్లలు చెరువులో మునిగిపోయారు. మృతదేహాలను వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో విషాదచాయలు అలుముకోగా, ఆంజనేయులు గృహ ప్రవేశ కార్యక్రమం ఆగిపోయింది. కేసు దర్యాప్తులో ఉంది. మృతుల్లో హేమంత్ ఇంటర్, నిఖేష్ ఎనిమిదవ తరగతి చదువుతున్నారు.

అరుదైన ఆపరేషన్

మహిళ కడుపులో నుంచి గాల్ బ్లాడర్, రాళ్లు తొలగింపు



ఆపరేషన్ చేసిన వైద్య బృందం



తొలగించిన గాల్ బ్లాడర్

దుబ్బాక: దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ హేమరాజ్ సింగ్ ఆధ్వర్యంలో బుధవారం వైద్యులు అరుదైన ఆపరేషన్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. దుబ్బాక మండలం హబ్షీపూర్‌కు చెందిన మల్లీ కళావతి 6 నెలలుగా తీవ్ర కడుపునొప్పితో బాధ పడుతోంది. వైద్యం కోసం దుబ్బాక ఆస్పత్రికి రాగా పరీక్షించిన వైద్యులు బిగ్ సైజ్ గాల్‌బ్లాడర్‌తో పాటు మల్టీపుల్ రాళ్లు ఉన్నట్లు గుర్తించారు. సర్జరీ చేసేందుకు పరీక్షలు చేయగా ఆమెకు రక్తం చాలా తక్కువగా ఉంది. 3 యూనిట్ల రక్తం ఎక్కించి వైద్యబృందం గంటకు పైగా శ్రమించి ఆరోగ్యశ్రీ పథకం కింద విజయవంతంగా ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగానే ఉందని డాక్టర్ హేమరాజ్‌సింగ్ తెలిపారు. ఆపరేషన్‌లో డాక్టర్లు రఘు., అలేఖ్యానాయుడు, రాఘవేందర్‌తో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'కొత్త ఆలోచనలతో ముందుకెళ్లాలి'

నర్సాపూర్: కాలేజీలో ఉన్న వనరులు, అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని కొత్త ఆలోచనలకు రూపం ఇవ్వాలని శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి ఆదిత్య విస్సామ్ అన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో నర్సాపూర్‌లో కొనసాగుతున్న బీవీ రాజు ఇంజనీరింగు కాలేజీలో బుధవారం ప్రథమ సంవత్సరం విద్యార్థులు, తల్లిదండ్రులతో పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన విస్సామ్ మాట్లాడుతూ.. నర్సాపూర్‌లోని తమ కాలేజీ రాష్ట్రంలో 9వ స్థానంలో ఉందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు అధునాతన ల్యాబరేటరీలు, లైబ్రరీ సదుపాయాలు ఉన్నాయన్నారు. ప్లేస్‌మెంట్‌లో సైతం కాలేజీ ముందు వరుసలో ఉందన్నారు. సొసైటీ వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్ మాట్లాడుతూ.. తమ పిల్లలను ఇతరులతో పోల్చడం కన్న ప్రాజెక్టుల ద్వారా వాస్తవ ప్రపంచ అనుభవాన్ని పొందడంలో తల్లిదండ్రులు మద్దతు ఇవ్వాలని సూచించారు.అనంతరం కాలేజీ సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె, డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, డీజీఎం కాంతారావు, మేనేజర్ బాపిరాజు, ఏటలు సురేశ్, అశోక్‌రెడ్డి, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

ప్రేమ వివాహం చేసుకుందని..

ఉరి వేసుకొని తండ్రి ఆత్మహత్య



రాజు (ఫైల్)

హుస్నాబాద్‌రూరల్: ఉరి వేసుకొని రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. అక్కన్నపేట మండలం తెనుగుపల్లెకు చెందిన రైతు కాటవేని రాజు(50) గౌరవెల్లి ప్రాజెక్టులో భాగంగా భూము లు కోల్పోవడంతో పోతారం(ఎస్) శివారులోని కాలనీలో ఉంటున్నాడు. రాజు చిన్న కూతురు ఐదురోజుల కిందట బంధువుల అబ్బాయిని ప్రేమ వివాహం చేసుకొంది. మంగళవారం కూతురు తిరిగి ఇంటికొచ్చింది. నాకు నచ్చని పెళ్లి చేసుకొని పరువుతీశావని మనస్తాపంతో ఇంట్లో నుంచి వెళ్లిపోయి హనుమాన్ దేవాలయం ఎదుట చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య సరోజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని మెలగిరిపేట్ శివారులో బుధవారం చోటు చేసుకుంది. సదాశివపేట సీఐ మహేశ్ కథనం మేరకు.. ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా, ఆత్రేయపురం గ్రామానికి చెందిన తెన్మెస నాగరాజ్(44) సదాశివపేట మండలంలోని మెలగిరిపేట్ శివారులో ఓ వ్యక్తి వద్ద భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. వ్యవసాయ సాగు, కుటుంబ అవసరాలకు అప్పులు చేశాడు. ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తి మనస్తాపంతో వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గుర్తించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బైక్ అదుపుతప్పి.. కరెంట్ పోల్‌ను ఢీకొట్టి

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



ఘటనా స్థలంలో స్వామి మృతదేహం

సిద్దిపేటకమాన్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రం సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. సిద్దిపేట వన్ టౌన్ సీఐ లక్ష్మీబాబు కథనం మేరకు.. చిన్నగుండవెల్లి గ్రామానికి చెందిన గుర్జకుంట స్వామి (31)కి అదే గ్రామానికి చెందిన శ్వేతతో 2019లో వివాహం జరుగగా నాలుగేళ్ల కూతురు ఉంది. కుటుంబ కలహాలతో కొంత కాలంగా స్వామి విడిగా ఉంటున్నాడు. స్వామి బుధవారం తెల్లవారు జామున బైక్‌పై సిద్దిపేట ప్రభుత్వాస్పత్రి వైపు నుంచి ముస్తాబాద్ చౌరస్తా వైపు వెళ్తున్నాడు. బైక్‌ను అజాగ్రత్తతో అతివేగంగా నడపడంతో రోడ్డు పక్కన ఉన్న కరెంట్ పోల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై స్వామి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య శ్వేత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని పాదాచారి

వర్గల్(గజ్వేల్): గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో పాదాచారి మృతి చెందాడు. ఈ ఘటన వర్గల్ మండలం గౌరారం రాజీవ్ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి చేసుకుంది. గౌరారం ఎస్సై కరుణాకర్‌రెడ్డి కథనం మేరకు.. గజ్వేల్‌కు చెందిన చిక్కుడు కిరణ్(30) మరి కొందరితో గౌరారంలో ఫ్లెక్సీలు కట్టేందుకు వచ్చాడు. మంగళవారం అర్ధరాత్రి 1.45 గంటల ప్రాంతంలో ఫ్లెక్సీలు పట్టుకొని రాజీవ్‌రహదారిపై కిరణ్ నడుచుకుంటూ వెళ్తుండగా ప్రజ్ఞాపూర్ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

కారు ఢీకొని వృద్ధుడు

కంగ్టి(నారాయణఖేడ్): రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన ఘటన కంగ్టి మండలం తుర్కవడ్‌గాం గ్రామ శివారులో బుధవారం చోటు చేసుకొంది. ఎస్ఐ విజయ్ కుమార్ కథనం మేరకు.. మండలంలోని గాజుల్‌పాడ్ గ్రామానికి చెందిన మాల లక్ష్మణ్(62) కూతురు రేణుక గ్రామమైన తుర్కవడ్‌గామ్‌కు వచ్చాడు. తిరిగి నడుచుకుంటూ వెళ్తుండగా తుర్కవడ్‌గామ్ సమీపంలో రాజ్ దాబా వద్ద కారు ఢీకొట్టింది. తీవ్రగాయాలైన అతడిని ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మృతి చెందాడు. మృతుడి కుమారుడు గౌతం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

చెరువు కాలుష్యం.. మత్స్యకారులకు శాపం

సంగారెడ్డిలో చేపలు మృత్యువాత..

- సుమారు రెండు లక్షలపైగానే..
- మహబూబ్‌సాగర్ చెరువును సందర్శించిన మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి



మహబూబ్ సాగర్ చెరువులో మృత్యువాత పడిన చేపలు

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి పట్టణంలోని మహబూబ్‌సాగర్ చెరువులో కాలుష్య జలాలు, ఆక్సిజన్ లెవల్ పడిపోవడంతో చేపలు మృత్యువాత పడుతున్నాయి. బుధవారం తెల్లారేసరికి చెరువులో ఒక్కసారిగా చేప పిల్లలు మృతి చెంది కనిపించాయి. సుమారు రెండు లక్షలకు పైగా మృతి చెందాయని, పట్టణంలోని కాలుష్య జలాలు చెరువులోకి వదలడంతోనే చనిపోయినట్లు మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. దీంతో జీవనోపాధి కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు.

మత్స్య కుటుంబాలను ఆదుకుంటాం

చేపలు మృత్యువాత పడిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఘటనా స్థలానికి చేరుకున్నారు. జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారుల కుటుంబాలన్ని అన్ని రకాలుగా ఆదుకుంటామని భరోసానిచ్చారు. మహబూబ్ సాగర్ చెరువును పరిశుభ్రం చేసి చేపలు పెంచుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులను ఆదేశించారు.

జీవనోపాధిని కోల్పోయాం



చెరువులో చేపలు పట్టుకొని జీవనం సాగిస్తూ ఉంటాం. నీరు కాలుష్యంతో సుమారు రెండు లక్షల పైగా చేపలు చనిపోవడంతో దీనిపైన ఆధారపడ్డ మాకు జీవనోపాధి లేకుండా పోయింది. చెరువులు కాలుష్యం కాకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలి. ఆర్థికంగా మమ్మల్ని ఆదుకోవాలి.
– ఆంజనేయులు, మత్స్యకారి

మత్స్యకారులను ఆదుకోవాలి



కాలుష్య నీటితో చెరువులోని చేపలు మృత్యువాతపడ్డాయి. దీంతో మత్స్యకారులకు ఆర్థికంగా ఇబ్బంది ఏర్పడింది. ప్రభుత్వమే మత్స్యకారులను ఆదుకోవాలి. ప్రతిరోజు చేపలు పట్టుకొని జీవనం సాగించే వారు ఉపాధి కోల్పోయారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి.
– నగేశ్, సంగారెడ్డి మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు

తిమ్మాపూర్ గ్రామంలో..

జగదేవ్‌పూర్(గజ్వేల్): చెరువులో నీళ్ల కలుషితం కావడంతో చేపలు మృత్యువాత పడిన ఘటన మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామంలోని గుండారెడ్డి చెరువులో గతేడాది లక్షకు పైగా వేశారు. అదే ఏడాది కొన్ని చేపలు పట్టారు. ఇటీవల కురిసిన వర్షానికి చెరువు నిండింది. బుధవారం ఉదయం చెరువు వైపు వెళ్లిన గ్రామస్తులకు చెరువులో చేపలు మృతి చెంది కనిపించాయి. పక్కన ఉండే కోళ్ల ఫారమ్ నుంచి వచ్చే కలుషితమైన నీరు చెరువులో కలువడంతోనే చేపలు మృతి చెందాయని గ్రామస్తులు ఆరోపించారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామ కార్యదర్శికి వినతిపత్రం అందించారు.



మృతి చెందిన చేపలు

రెండు బైక్‌లు ఢీ

చిన్నశంకరంపేట(మెదక్):రెండు బైక్‌లు ఢీకొని ఒకరు మృతి చెందారు. నార్సింగి ఎస్ఐ అహ్మద్ మోహినోద్దీన్ కథనం మేరకు.. వల్లాభాపూర్ తండాకు చెందిన నేనవత్ మంత్యా(44) బైక్‌పై నార్సింగ్‌కు వెళ్తున్నాడు. చేగుంటకు చెందిన మరో వ్యక్తి బైక్‌పై నార్సింగ్‌కు వెళ్తున్నాడు. నార్సింగి సర్వీస్ రోడ్డులోకి రాగానే రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మంత్యా అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్రంగా గాయాలు అయ్యాయి. క్షతగాత్రుడిని రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చేపల వేటకు వెళ్లి మృతి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందాడు. సదాశివపేట సీఐ మహేశ్ కథనం మేరకు.. మండల పరిధిలోని తంగడపల్లి తండా గ్రామానికి చెందిన సభవత్ పాండు (41) వ్యవసాయ కూలీగా పని చేసుకుంటూ అప్పుడప్పుడూ చేపల వేటకు వెళ్తుండేవాడు. ఈనెల 19న చేపల వేటకు వెళ్లి వస్తానని ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా జాడ దొరకలేదు. చేపలు పట్టే క్రమంలో రాళ్లలో ఇరుక్కుపోయి మృతి చెంది బుధవారం ఉదయం చెరువులో మృతదేహమై తేలాడు. అటుగా వెళ్లిన స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.